సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ❘ 23 ❘ మే ❘ 2023



31,572 మంది విద్యార్థులు..

ఇంటర్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి పరీక్షలు జరగనున్నాయి. - 8లో



స్కూటీల పంపిణీ

దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేశారు. 20 మందికి కలెక్టర్ అందజేశారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	36°	26°
ఇచ్ఛాపురం	36°	27°
పాతపట్నం	37°	27°
శ్రీకాకుళం	37°	26°

న్యూస్‌రీల్

'25లోగా ఫీజు చెల్లించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్ చదువుతూ.. ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ ఫీజులను ఈనెల 25వ తేదీలోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. టెన్త్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ. 100 చొప్పున, ఇంటర్ పరీక్షలకు సబ్జెక్టుకు రూ.150 చొప్పున ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈనెల 25వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.25 ఆలస్య రుసుంతో ఈనెల 26 నుంచి 29 వరకు, రూ.100 ఆలస్య రుసుంతో ఈనెల 30, 31 తేదీల్లో చెల్లించేందుకు వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. తత్కాల్ ఫీజుతో జూన్ 2వ తేదీలోగా చెల్లించాలని, గతంలో ప్రవేశం పొంది పరీక్ష ఫీజు చెల్లించనివారు, పరీక్షలలో ఉత్తీర్ణులు కాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సూచించారు. పరీక్ష ఫీజులను మీసేవ, ఏపీఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

నేటితో ముగియనున్న ఏపీఈఏపీ సెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 15న ప్రారంభమైన ఏపీఈఏపీసెట్–2023 మంగళవారంతో ముగియనుంది. 15 నుంచి 19వరకు ఇంజినీరింగ్ పరీక్షలు జరగ్గా, సోమవారం నుంచి అగ్రికల్చర్, ఫార్మశీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. టెక్కలి ఐతంలో మొదటి షిఫ్ట్‌లో 132 మందికి 125, రెండో షిఫ్ట్‌లో 130కి 120 మంది, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 189కి 178, రెండో షిఫ్ట్‌లో 186కి 175, చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 190కి 181, రెండు షిఫ్ట్‌లో 190కి 179 మంది హాజరయ్యారు.

30 నుంచి ముఖలింగేశ్వరుని కల్యాణోత్సవం



శ్రీముఖలింగేశ్వర స్వామివారు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుని కల్యాణోత్సవం ఈ నెల 30 నుంచి జూన్ నెల 4 వరకూ నిర్వహించనున్నట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. 30న గణపతి పూజతో ప్రారంభించి ధ్వజారోహణ, బలిహరణ, 31న జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి స్వామి తిరువీధి ఉత్సవం, పుట్టమన్ను తేవడం, శతమానం, మట్టెలు తీసుకొని రావడం, రాత్రి తొమ్మిది గంటలకు స్వామి కల్యాణం రాయబారం, పది గంటలకు కల్యాణం ఔపాసన అనంతరం రాత్రి పార్వతీ పరమేశ్వరులకు నంది వాహనంపై తిరువీధి ఉత్సవం, మే ఒకటిన స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే 2న సదస్యం, పండిత సభ, చతుర్వేద పారాయణం, మహా మంత్రపుష్పం, హారతి, 3న దొంగ వెళ్లి మైనాకోత్సవం, రాత్రి ఏడు గంటలకు మైనాకుని ఉత్సవం 4న నాగవల్లి, స్వామివారి వసంతోత్సవం, అనంతరం పవిత్ర వంశధార నదిలో పవిత్ర స్నానాలు ఉంటాయని పేర్కొన్నారు.

స్పందనకు 167 అర్జీలు


శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన అర్జీల రీఓపెన్‌కు ఆస్కారం లేని రీతిలో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఉప కలెక్టర్ జయదేవి అర్జీలు స్వీకరించారు. ఈ సమస్యలపై 24 గంటల్లో స్పందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో 167 మంది అర్జీదారులు తమ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.మీనాక్షి, డీఎస్ఓ వెంకటరమణ, డీపీఓ రవికుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 33 అర్జీలు



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చిన బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. బాధితుల నుంచి మొత్తం 33 అర్జీలు అందాయి. వచ్చిన వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ వెంటనే సంబంధిత అధికారులను వారికి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ జీఆర్ శ్రీనివాసరావు ఉన్నారు.



సాగర సంగమం సంపూర్ణమవ్వాలంటే బాలుకు ఓ రఘుపతి కావాలి. సీతాకోక చిలుక అందంగా ఎగరాలంటే ఆ కథకు డేవిడ్ ఉండి తీరాలి. అన్వేషణ అంతం కావాలంటే అడుగడుగునా జేమ్స్ కనిపించాలి. ఆపద్బాంధవుడిలా చిరంజీవి మారాలంటే శ్రీపతి లాంటి ఉత్తముడు రావాలి. అప్పులనరసయ్య సంసారాన్ని చదరంగంలా ఆడాలంటే ప్రకాష్ అనే పొగరుబోతు కొడుకు ఇంటిలో తిరగాలి. పనివాడు ముత్తు గొప్పవాడిగా మారాలంటే నిజం తెలుసుకునే జమీందార్ అతని కళ్ల ముందుండాలి. ఇన్ని గొప్ప కథలకు, ఇలాంటి కథకులకు వరంలా దొరికిన నటుడు శరత్‌బాబు. ఆమదాలవలసలో పుట్టి పెరిగిన ఈ అందగాడు తెలుగు, తమిళ సినిమాల్లో మర్చిపోలేని పాత్రలకు ప్రాణప్రతిష్ట చేశారు. వెండితెరపై అందంగా వికసించిన ఆయన నవ్వు ఇప్పుడు మాయమైపోయింది. అర్ధ శతాబ్దం పాటు అప్రతిహతంగా సాగిన నట ప్రస్థానం నేటికి కళామతల్లి పాదాల చెంతకు చేరుకుంది. వంశధార నుంచి మెరీనా తీరం వరకు ఆయన సాగించిన ప్రయాణం సిక్కోలు స్మరించుకుంటోంది.

ముగిసిన శరత్‌కాలం

- సీనియర్ నటుడు శరత్‌బాబు కన్నుమూత
- శోకసంద్రంలో ఆమదాలవలస

జన్మదినం:	1951 జూలై 31
స్వస్థలం:	ఆమదాలవలస
అసలు పేరు :	సత్యనారాయణ దీక్షితులు
మొదటి సినిమా :	రామరాజ్యం(1973)
చివరి సినిమా :	మళ్లీ పెళ్లి (ఈ నెల 26న విడుదల కానుంది)

ఆమదాలవలస: వంశధార నదీ తీరాన సత్యనారాయణ దీక్షితులుగా ఆడిపాడిన శరత్‌బాబు వేలాది మంది సినిమా అభిమానులను శోకంలో ముంచుతూ శాశ్వత సెలవు తీసుకున్నారు. ఆమదాలవలసకు చెందిన ఆయన రెండు నెలల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ముందు చెన్నైలోనే ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. అక్కడి నుంచి బెంగళూరు, మళ్లీ అక్కడి నుంచి హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్టీ ఆర్గాన్స్ డ్యామేజ్, కిడ్నీ ఫెయిల్యూర్, లంగ్స్ ఇష్యూతో ఆయన ఇబ్బంది పడుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు.

ఆమదాలవలసలోనే..

శరత్‌బాబు బాల్యం, యవ్వనం ఆమదాలవలసలోనే గడిచింది. ఆయన తండ్రి విజయ్‌శంకర్ దీక్షితులు ఉత్తరప్రదేశ్‌లో పెళ్లి చేసుకుని ఆమదాలవలస వచ్చి స్థిరపడ్డారు. శరత్‌బాబు ఇక్కడే పుట్టారు. ఆయన అసలు పేరు సత్యనారాయణ దీక్షితులు. 13 మంది సంతానంలో శరత్‌బాబు ఒకరు. వీరికి ఆమదాలవలసలో రైల్వేస్టేషన్ ఎదురుగా గౌరీ శంకర్ విలాస్ అనే బ్రాహ్మణ భోజన హొటల్ ఉండేది.

- శరత్‌బాబు ఆమదాలవలసలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్‌మీడియెట్ చదివారు. డిగ్రీ శ్రీకాకుళంలో ఆర్ట్స్ కళాశాలలో చదివారు.
- తిత్లీ తుఫాన్ సమయంలో రెండు లక్షల రూపాయలు జిల్లాకు ఆర్థిక సాయం చేశారు. అలాగే ఆమదాలవలసలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, అయ్యప్ప స్వామి దేవాలయం, సంగమేశ్వర దేవాలయాలకు ఒక్కో లక్ష చొప్పున విరాళాలు అందించారని కుటుంబ సభ్యులు తెలిపారు.



నరసన్నపేటకు సినీ నటులు శరత్‌బాబు 1980 లో వచ్చారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి స్నేహితుడు, క్లాస్‌మేట్ అప్పటి తహసీల్దార్ ప్రస్తుత విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పీరు ఎర్రయ్య ఇంటికి వెళ్లారు. ఎర్రయ్యతో చాలా సేపు ముచ్చటించారు. -నరసన్నపేట

• సంగమయ్య ఆలయానికి విరాళం



సంగమేశ్వర కొండ వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయం

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలంలోని సంగమేశ్వర కొండకు శరత్‌బాబు తన సొంత ఖర్చుతో ఐదేళ్ల కిందట టైల్స్ వేయించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలో మొట్టమొదటిగా నిర్వహించే జాతర సంగమేశ్వర జాతర. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందినవారు జనం వచ్చి సంగమయ్య కొండను, గుహలో ఉన్న సంగమయ్యను దర్శించుకుంటారు. అలాంటి సమయాల్లో గుహ లోపలకు వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు శరత్ బాబు దృష్టికి తీసుకురావడంతో వెంటనే గుహ లోపల టైల్స్ వేయించాలని తన సోదరులకు తెలపడంతో వాటిని అమర్చారు.



శరత్‌బాబును సత్కరిస్తున్న స్నేహాంజలి సభ్యులు

స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమీ, శ్రీకాకుళంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న శరత్‌బాబును ఘనంగా సత్కరించారు. -శ్రీకాకుళం కల్చరల్

సత్కరించుకున్నాం..

శ్రీకాకుళంలో పదేళ్ల కిందట స్నేహాంజలి కల్చరల్ అకాడమీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించాం. మేము బలగలో నిర్మించిన రాఘవేంద్రస్వామి ఆలయానికి వచ్చారు.
– బరాటం సతీష్‌కుమార్, సిమెంట్ మర్చంట్

దిగ్భ్రాంతికి గురయ్యా: స్పీకర్



ఆమదాలవలసకు మంచి పేరు తెచ్చిన నటుడు శరత్ బాబు మృతి చెందడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం ఓ ప్రకటనలో తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమదాలవలస నియోజకవర్గంలో, ఆమదాలవలస పట్టణానికి చెందిన సత్యనారాయణ దీక్షితులు అలియాస్ శరత్ బాబు మృతి చెందిన సమాచారం తనకు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ చదువుకున్న రోజుల్లోనే నటనపై శరత్ బాబుకు మక్కువ ఉండేదన్నారు. అప్పట్లో ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవంలో 'వాపస్' నాటకంలో నిరుద్యోగ యువకుడిగా శరత్ బాబు వేసిన పాత్ర రక్తి కట్టించిందన్నారు. 44 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో ఆమదాలవలస పేరు ప్రఖ్యాతలు బాహ్య ప్రపంచానికి పరిచయం చేసిన వారిలో శరత్ బాబు ఒకరిని కొనియాడారు. శరత్ బాబు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తీరని లోటు

శరత్‌బాబు మృతి అటు సినీ పరిశ్రమకు, ఇటు ఆమదాలవలసకు తీరని లోటని ఆమదాలవలసకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జీజే మోహన్‌రావు అన్నారు. శరత్‌బాబుతో తమ కుటుంబానికి స్నేహ సంబంధాలు ఎక్కువగా ఉండేవని జ్ఞాపకం చేసుకున్నారు. చివరిసారిగా ఆమదాలవలసలో అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ సమయంలో ఆయన వచ్చారని చెప్పారు. ఆమదాలవలస పట్టణంలోని గల ప్రధాన రహదారి సింగపూర్ రహదారిలా తీర్చిదిద్దుదామని శరత్‌బాబు అన్నారని తెలిపారు. శరత్‌బాబుకు ఆమదాలవలస లో ఎర్నాగుల ప్రభాకరరావు, పీరు యర్రయ్య, రవిబ్రహ్మం అనే స్నేహితులు ఉన్నారని, ప్రస్తుతం వారంతా ఉద్యోగ రీత్యా వేరే చోట్ల నివసిస్తున్నారని తెలిపారు.



శరత్‌బాబుతో సాహిత్య అకాడమీ రాష్ట్ర డైరెక్టర్, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జీజే మోహనరావు (ఫైల్)

కలిసేవాళ్లం



ఆర్ట్స్ కాలేజీలో చదువుకున్న శరత్ బాబు కళాశాలలో నాటక ప్రదర్శనలు ఇచ్చేవా రు. అప్పట్లో ఇక్కడి లలిత శ్రీ కళా సమితి వారు స్థానిక ఎంహెచ్‌స్కూల్ తిలక్ హాలులో వేసే రిహార్సల్ చూసేందుకు వచ్చేవారు. మేమెప్పుడైనా మద్రాస్ వెళ్తే ఆయనను కలిసేవాళ్లం. - ఎల్.రామలింగస్వామి, రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు

సంతాపం

శరత్‌బాబు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని పట్టణానికి చెందిన అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు కేవీ రాజారావు, కార్యదర్శి మందపల్లి రామకృష్ణ అన్నారు. ఆయన మృతికి ఆమదాలవలస కు చెందిన గురుస్వామి యర్నాగుల, మాజీ కౌన్సిలర్ జేజే వెంకటేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

కలిసి చదువుకున్నాం

శరత్ బాబు మృతి చెందారని తెలియగానే సొంత కుటుంబ సభ్యుడిని కోల్పోయాననే బాధ కలిగింది. నేను, శరత్ బాబు ఏడో తరగతి నుంచి కలిసి చ దువుకున్నాం. శ్రీకాకుళం డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో ఆయన ఎంపీసీ, నేను సీబీజెడ్‌లో చేరాం. మంచి తెలివైన విద్యార్థి. క్రమశిక్షణకు మారుపేరు. శరత్ బాబు ఒరిజనల్ పేరు సత్యనారాయణ దీక్షితులు. ఆయన ముప్పైఏళ్లు వరుసగా అయ్యప్ప మాల వేశారు. 2019 వరకూ ఎప్పటికప్పుడు మాట్లాడుకునేవాళ్లం. తర్వాత తగ్గింది. 1980 లో నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టంకాల బాబ్జీ తదితరులు శరత్‌బాబును సత్కరించారు. ఆ జ్ఞాపకాలన్నీ గుర్తుకు వస్తున్నాయి.
– పీరు ఎర్రయ్య, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్



ఒక సన్మాన సభలో శరత్ బాబుతో ఎర్రయ్య

రూమ్‌లో ఉన్నాం..



శరత్‌బాబు మద్రాసులో మాతో పాటు రూమ్‌లో ఉండేవారు. నేను సినీ గాయకుడు ఆనంద్ కలసి ఆ రోజుల్లో సుకుమార్ ఆర్కెస్ట్రా నడిపేవాళ్లం. ఆ డబ్బులతో రోజువారి ఖర్చులు జరిగేవి. మాకు అక్కడ బాగోలేకపోవడంతో వచ్చేశాం. కానీ ఆయన మాత్రం ఉండిపోయారు.
– బందారు చిట్టిబాబు, సినీ సంగీత దర్శకుడు

సాయం మరువలేనిది



ఆమదాలవలసకు చెందిన నేను ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడిని. శరత్ బాబు ద్వారానే ఇండస్ట్రీకి వెళ్లాను. 35 ఏళ్లుగా ఆ రంగంలోనే ఉన్నాను. నాకు శరత్‌బాబు చాలా సహాయం చేశారు. ప్రస్తుతం నేను తమిళనాడులో నివసిస్తున్నాను. ఆయన మృతి తీరని లోటు.
– కృష్ణారావు, ఎలక్ట్రీషియన్, సినీ పరిశ్రమ

సంక్షేమ సమాచారమిదే..

- సంక్షేమ క్యాలెండర్ 2023-24 ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను నిర్ణయించిన తేదీ ప్రకారం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన 'జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023-24' లను సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జేసీ ఎం.నవీన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఏ నెలలో ఏ సంక్షేమ పథకం అందజేయనున్నారో అన్ని వివరాలను షెడ్యూల్ చేశారని వివరించారు. ఈ క్యాలెండర్‌ను మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పంపిణీ చేయాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ మాత్రమే సంక్షేమ పథకాల క్యాలెండర్ ముందుగానే ప్రకటిస్తున్నారని తెలిపారు. క్యాలెండర్ ఆవిష్కరణలో డీపీఆర్ఓ కె.బాలమాన్ సింగ్, జెడ్పీ సీఈఓ వెంకట్రామన్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బి.మీనాక్షి, డీఎస్ఓ వెంకటరమణ, డీపీఓ రవికుమార్ పాల్గొన్నారు.



సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

పథకాల వివరాలివే..

- **మే 2023:** వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ (మొదటి విడత), వైఎస్సార్ ఉచిత పంటల బీమా, జగనన్న విద్యాదీవెన (మొదటి విడత), వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా (మొదటి త్రైమాసికం), వైఎస్సార్ మత్స్యకార భరోసా
- **జూన్:** జగనన్న విద్యా కానుక, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ లా నేస్తం (మొదటి విడత), మిగిలిపోయిన లబ్ధిదారులకు లబ్ధి.
- **జూలై :** జగనన్న విదేశీ విద్యా దీవెన (మొదటి విడత), వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలు, జగనన్న తోడు (మొదటి విడత), వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ), వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీతోఫా (రెండో త్రైమాసికం).
- **ఆగస్టు :** జగనన్న విద్యా దీవెన (రెండో విడత), వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర.
- **సెప్టెంబర్ :** వైఎస్సార్ చేయూత
- **అక్టోబర్ :** వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ (రెండో విడత), జగనన్న వసతి దీవెన (మొదటి విడత)
- **నవంబర్:** వైఎస్సార్ సున్నావడ్డీ – పంట రుణాలు, వైఎస్సార్ కల్యాణమస్తు– షాదీతోఫా (మూడవ త్రైమాసికం), జగనన్న విద్యాదీవెన (మూడో విడత).
- **డిసెంబర్:** జగనన్న విదేశీ విద్యాదీవెన (రెండో విడత), జగనన్న చేదోడు, మిగిలిన వారికి లబ్ధి.
- **జనవరి:** వైఎస్సార్ రైతుభరోసా – పీఎం కిసాన్ (మూడో విడత), వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు (రెండవ విడత), వైఎస్సార్ లా నేస్తం (రెండవ విడత), పెన్షన్ల పెంపు (నెలకు రూ. 3000).
- **ఫిబ్రవరి 2024:** జగనన్న విద్యా దీవెన (నాల్గో విడత), వైఎస్సార్ కల్యాణమస్తు షాదీ తోఫా (నాల్గో త్రైమాసికం), వైఎస్సార్ ఈబీసీ నేస్తం
- **మార్చి:** జగనన్న వసతి దీవెన (రెండో విడత), ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలు.

• పాతపట్నం.. కొత్త ఉత్సాహం



సుందరంగా విద్యుత్ దీపాలంకరణ (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో నీలమణిదుర్గ అమ్మవారు

నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలతో పాతపట్నంకు కొత్త ఉత్సాహం వచ్చింది. ఈ నెల 24వ తేదీన దేవర జంగిడితో అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానిస్తున్న నేపథ్యంలో కాపువీధిలో ఉన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా లక్షలాది రూపాయల వ్యయంతో పాతపట్నం ప్రధాన రహదారిలో అమ్మవారి ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. -పాతపట్నం

క్లుప్తంగా

కేతు విశ్వనాథరెడ్డి మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: అరసం పూర్వ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మృతి పట్ల శ్రీకాకుళ సాహితీ సభ్యులు సోమవారం సంతాపం ప్రకటించారు. ఒంగోలులో గుండెపోటుతో మరణించిన ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వానకురిస్తే, తేడా, అమ్మవారి నవ్వు, కూలిన బురుజు, నమ్ముకున్న నేల వంటి వంద కథలు, బోధి, వేర్లు వంటి నవలికలు రచించారని కొనియాడారు. సంతాపం తెలియజేసిన వారిలో రచయితలు అట్టాడ అప్పలనాయుడు, దాసరి రామచంద్రరావు, చింతాడ తిరుమలరావు, కళమట దాసుబాబు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు స్కూటీల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని 20 మంది ఆర్థోపెడిక్ దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు(ట్రై స్కూటర్ల)ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పంపిణీ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రూ.లక్షా ఇరవై వేల విలువైన వాహనాన్ని లబ్ధిదారుకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ నవీన్, దివ్యాంగుల శాఖ సిబ్బంది కవిత, వర్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు

సొంత ఖాతాకు ఇంటి పన్ను నిధులు

పొందూరు: కోటిపల్లి పంచాయతీ పరిధిలోని కోటిపల్లి, మజ్జిలిపేట గ్రామాల్లో వసూలు చేసిన ఇంటి పన్ను నిధులను పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ సొంత ఖాతాకు మళ్లించారు. 10 మంది వలంటీర్ల ద్వారా సేకరించిన రూ.1,02,550లో పంచాయతీ ఖాతాకు రూ.5 వేలు జమచేసి మిగిలిన మొత్తాన్ని సొంత ఖాతాకు మళ్లించారని కోటిపల్లి సర్పంచ్ టి.సుధారాణి కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇంటి పన్ను నిధుల ఆధారాలను అధికారులకు అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం శ్రీకాకుళం ఏడీఎల్‌పీఓ విచారణ చేపడతారని మండల పరిషత్ ఏఓ మురళీకృష్ణ తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

రణస్థలం: జీరుకొవ్వాడలో కుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామానికి చెందిన కొరెడ్ల అవినాష్, రామచరణ్, శ్రావణిలు ఇంటి ముందు ఆడుతుండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. చిన్నారుల కేకలు విని తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో కుక్కలు పారిపోయాయి. చిన్నారులను సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

పీజీటీ మిగులు పోస్టుల భర్తీకి సన్నాహాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లాలో ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ కోర్సుల బోధనకు ఐదు మిగులు పీజీటీ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల నుంచి జిల్లా విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లాలో ఆరు జిల్లా పరిషత్ యాజమాన్యంలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 42 పీజీటీల పోస్టుల భర్తీకి ఈ నెల 20న కౌన్సెలింగ్ నిర్వహించగా 37 మంది అభ్యర్థులు వారు కోరుకున్న స్థానాల్లో నియమితులయ్యారు. మరో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జెడ్పీహెచ్ స్కూల్ వజ్రపుకొత్తూరులో ఫిజిక్స్, బోటనీ, జువాలజీ పీజీటీలు, జెడ్పీహెచ్ స్కూల్ బ్రాహ్మణతర్లాలో ఫిజిక్స్ పీజీటీ, జెడ్పీహెచ్ స్కూల్ హరిపురంలో జువాలజీ పీజీటీ పోస్టు భర్తీ కావాల్సి ఉన్నాయి. అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 24లోగా దరఖాస్తుతో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి హాజరుకావాలని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య కోరారు.

'చర్చలకు విరుద్ధంగా బదిలీ ఉత్తర్వులు'

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి విడుదల చేసిన ఉత్తర్వులు లోపభూయిష్టంగా ఉన్నాయని, దానిపై మరింత స్పష్టతనివ్వాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇటీవల జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలకు భిన్నంగా మార్గదర్శకాలు జారీ కావడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీల ప్రకటన జిల్లా యూనిట్‌గా మంజూరైన పోస్టుల సంఖ్య నుంచి పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య తీసివేయగా మిగిలిన పోస్టుల సంఖ్యను కేటగిరీల వారీగా బ్లాక్ చేయడం తగదన్నారు. ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సు బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారి కోసమే ఈ విధంగా బ్లాక్ చేస్తున్నారని ఆరోపించారు.

86 కేంద్రాలు..

31572 మంది విద్యార్థులు



కొయ్యాం జూనియర్ కాలేజీలో హాల్‌టికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్ కె.తవిటినాయుడు, సిబ్బంది

- రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఎండల నేపథ్యంలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



సీసీ కెమెరాల స్ట్రీమింగ్‌ను పరిశీలిస్తున్న డీవీఈఓ కోట ప్రకాశరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 24 నుంచి మొదలుకానున్న పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఫెయిలైన విద్యార్థులతోపాటు ప్రథమ సంవత్సరంలో మార్కులు పెంచుకునేందుకు (ఇంప్రూవ్‌మెంట్/బెటర్‌మెంట్) మరికొంతమంది పరీక్షలు రాస్తున్నారు. మొత్తమ్మీద జిల్లా వ్యాప్తంగా 31572 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో 20333 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11239 మంది ఉన్నారు. వీరందరికీ పరీక్షల నిర్వహణకు 86 కేంద్రాలను కేటాయించారు. వీటిలో ప్రభుత్వ యాజమాన్య కళాశాలలే అధికం. ఆయా కేంద్రాల్లో ఫర్నిచర్‌ను సిద్ధం చేశారు. సీసీ కెమెరాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేసి అమర్చారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించి వారికి డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు, డీఈసీ కమిటీ సభ్యులు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. 86 పరీక్ష కేంద్రాలకు 86 మంది సీఎస్‌లు, 86 మంది డీవోలు, 20 మంది కస్టోడియన్లను నియమించారు. 38 స్టోరేజ్ పాయింట్లతో ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. పరీక్ష కేంద్రాలపై నిఘా పెట్టేందుకు హైపవర్ కమిటీ, జిల్లా పరిశీలకులతోపాటు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్, మరో నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు.

నిమిషం ఆలస్యమైనా..

సప్లమెంటరీ పరీక్షలు రెండు సెషన్లగా నిర్వహిస్తున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించబోమని స్పష్టం చేస్తున్నారు. 144 సెక్షన్ పక్కాగా అమలయ్యేందుకు, పరీక్ష కేంద్రాల వద్ద పహారా కాసేందుకు పోలీసు సిబ్బందిని నియమించారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా నిషేధించారు. గ్రామీణ ప్రాంతాల్లో 15 ప్రత్యేక రూట్లలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.

అసౌకర్యం కలగకుండా..

ఎండల నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్, మెడికల్ కిట్లతో సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. ఇటీవల ఓడీ బేస్‌లను రద్దు చేయడంతో నాన్‌టీచింగ్ సిబ్బంది పూర్తిగా లేని ప్రభుత్వ కాలేజీల్లో అక్కడి ప్రిన్సిపాళ్లు, సీఎస్‌లు, డీవోలు ఇబ్బందులు పడుతున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు ముగిసే వరకు వారిని యథాస్థానాల్లో పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి..



రేపటి నుంచి జరిగే ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు దాదాపుగా ఏర్పాట్లు పూర్తి చేశాం. డీఈసీ కమిటీ నేతృత్వంలో అధికారులు, సిబ్బందిని ఇప్పటికే నియమించాం. అధిక ఎండలు, ఉక్కపోతల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– ఎస్.తవిటినాయుడు, జిల్లా ఆర్‌ఐఓ, శ్రీకాకుళం

ఫీల్డ్ అసిస్టెంట్ల తీరుపై ఆగ్రహం

- తక్షణమే తొలగించాలని వేతనదారుల ధర్నా



ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్‌రెడ్డిని నిలదీస్తున్న వేతనదారులు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నీలాపు ప్రసాద్‌రెడ్డి, బొమ్మాళి రామారావులపై వేతనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా నౌపడ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలు ఒక్కొక్కటీ వెలుగు చూస్తున్నాయి. దీనిపై సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనులు నిలిపేసి తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారంటూ సోమవారం వేతనదారులంతా సచివాలయం వద్దకు చేరుకున్నారు. కూర్నాథపురం, పాలనాయుడు పేట, జగన్నాథపురం, సీతానగరం గ్రామస్తులకు పని కల్పిస్తూ నౌపడ గ్రామస్తులకు మాత్రమే పనులు నిలిపివేయడంపై మండిపడ్డారు. తొలుత పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి వద్ద బాధను వివరించి పనులు కల్పించాలని కోరారు. ఆయన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను పిలిపించి పనులు ఎందుకు కల్పించడం లేదని వివరణ కోరారు. దీనిపి పొంతన లేని సమాధానం చెప్పడంతో వేతనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు వేతనదారులు తమ జాబుకార్డులు ఎందుకు తొలగించారని నిలదీశారు. జాబ్ కార్డు కోసం రూ.300 నుంచి రూ.400 చొప్పున వసూలు చేసి జాబ్ కార్డు ఎందుకు ఇవ్వలేదని ఇంకొందరు ప్రశ్నించారు. ఈ క్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పించుకొనే ప్రయత్నం చేయగా వేతనదారులు వెంబడించారు. అనంతరం ధర్నా చేపట్టారు. అధికారులు వెంటనే వారిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట



కొర్లాంలో పథకాల కరపత్రాలు అందజేస్తున్న పిరియా సాయిరాజ్, దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్

సోంపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌లతో కలిసి సోంపేట మండలం కొర్లాంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదో తెలుసుకుంటున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వర్ రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, ఇచ్ఛాపురం, కంచిలి ఏఎంసీ చైర్మన్లు ఎస్.బాబూరావు, బతకల మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, పార్టీ నాయకులు మర్ల శంకరరావు, బీన ఢిల్లీరావు, పొందూరు గున్నయ్య, బతకల సతీష్, కె.శ్రీను, బంగారు పాపారావు, బత్తిని బాలరాజు, తులసీరావు, వర్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ చేయొద్దు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీల్లో ఏ ఒక్క ఉపాధ్యాయ పోస్టును బ్లాక్ చేయకుండా అన్ని పోస్టులను కేటగిరీల వారీగా ప్రదర్శించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడాల తమ్మినాయుడు, ఎస్వీ రమణమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాజాగా విడుదలైన ఉపాధ్యాయ బదిలీల మార్గదర్శకాల జీఓ నంబర్ 47లోని అంశాలను పరిశీలిస్తే.. ఇందులో ఇటీవల విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాల చర్చల సందర్భంగా ప్రదర్శించిన విషయాలు, అంగీకరించిన విషయాలలో కొన్ని మార్పులు కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా కేటగిరీ వారీగా మొదటి, రెండు, మూడో కేటగిరిలో 10 శాతం వరకు బ్లాక్ చేస్తున్నట్టు మార్గదర్శకాల్లో ఉందని తెలిపారు. ఇలా 10 శాతం వరకు మూడు కేటగిరీలో బ్లాక్ చేస్తే ఉపాధ్యాయుల బదిలీలలో ఆశించిన ఫలితాలు రాకపోవచ్చని పేర్కొన్నారు. సింగిల్ టీచర్ ఉపాధ్యాయులు బదిలీ అయిన సందర్భంలో నూతన టీచర్ ఆ పాఠశాలలో చేరే వరకు రిలీవ్ కాకూడదని ఉందని, ఈ నేపథ్యంలో 100 శాతం ఖాళీలు ప్రదర్శిస్తే ఎలాంటి నష్టం జరగదని తెలిపారు. ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ సజావుగా ముగిసిన అనంతరం ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టడం ద్వారా ఇంకా ఖాళీలు ఉండే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయవచ్చునని పేర్కొన్నారు.

ఈడబ్ల్యూఎస్‌పై కోర్టు తీర్పు హర్షణీయం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అగ్రవర్ణాల ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఉత్తరాంధ్ర తెలగ కులస్తుల తరపున ఏపీ కాపునాడు ఉపాధ్యక్షుడు ద్వారపు అజిత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమసమాజ స్థాపనకు సార్థకత చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం చేసిన 103వ రాజ్యాంగ సవరణను మరోమారు సమర్థిస్తూ దాఖలైన పిటీషన్లు కొట్టివేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాకమని ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర తెలగాలను పూర్తిస్థాయిలో వెనుకబడిన తరగతుల జాబితాల్లో చేరిస్తేనే పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేసినవారిలో కుదిరెల్ల అప్పారావు, పిల్లల రామకృష్ణారావు, సిద్దా జగదీష్, దేవిరెడ్డి వీరబాబు, మట్ట ఖగేశ్వరరావు తదితరులున్నారు.

విపక్షాల విమర్శలను తిప్పికొట్టండి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్/ఆమదాలవలస: విపక్షాల విమర్శలను తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, గత ప్రభుత్వ పనితీరును, ప్రస్తుత పాలనను ప్రతిఒక్కరూ బేరీజు వేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. సోమవారం శ్రీకాకుళం రూరల్ మండలం, ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలన ఎలా ఉందో తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మీ ముందుకు వచ్చామన్నారు. ఎన్నికల హామీల్లో 90 శాతం పైగా నెరవేర్చామన్నారు. గత టీడీపీ పాలనలో చేయని పనులన్నీ ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తోందన్నారు. గత పాలకులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో ఎందుకు వెనకంజ వేశారని ప్రశ్నించారు. శ్రీకాకుళం పరిధిలో రూ.12 వేల కోట్లతో భూమి కొనుగోలు చేసి 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు ఇచ్చామన్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క ఎకరా అయినా కొనుగోలు చేశారా అని ప్రశ్నించారు. చింతాడలో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మేలు చేసిన ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బోర చిన్నంనాయుడు, బోర రమణారావు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, బోర చంటి, చింతాడ వెంకటరమణ, గొండు కృష్ణమూర్తి, చిట్టి రవి, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, ఈఈ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ పునఃప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మగటపల్లి వెంకటరమణ మూర్తి ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న నేత్రదానం తిరిగి ప్రారంభమైనట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సోమవారం తెలిపారు. కోవిడ్ సమయంలో నిలిపివేసిన ఈ కేంద్రంలో పనిచేస్తున్న సాంకేతిక నిపుణుడు మరో ఉద్యోగానికి వెళ్లిపోవడంతో అప్పట్లో సేవలు నిలిచిపోయాయన్నారు. కొత్తగా సాంకేతిక నిపుణులు పి.సుజాతను నియమించి ట్రస్టు ద్వారా హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో శిక్షణ ఇప్పించామని పేర్కొన్నారు. ఎవరైనా చనిపోతే వారి నేత్రాల కార్నియాను దానం చేయదలచిన వారు 7799334321, 7842699321, 08942-226555 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ సుగుణాకరరావు, బేగమ్, సతీష్, సభ్యులు చిన్మయరావు, ప్రకాష్, పావని, సుమతి తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,420-00
బంగారం(22సి. 10గ్రా.)	56,300-00
వెండి (కిలో)	78,600-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 495.00
విజయనగరం	రూ. 499.00
శ్రీకాకుళం	రూ. 499.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



కిషోర్ (ఫైల్)



మల్ల సంతోష్ (ఫైల్)

నరసన్నపేట: నరసన్నపేట బైపాస్‌రోడ్డులో సత్యవరం బ్రిడ్జిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి బీసీకాలనీకి చెందిన పాండవుల కిషోర్ (32) మృతి చెందారు. ఇదే ఘటనలో సత్తు రాముకు తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి నుంచి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వస్తుండగా వాహనం అదుపు తప్పి రోడ్డు గోడకు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంతో వస్తున్న ద్విచక్ర వాహనం కొంతదూరం రాసుకుంటూ వెళ్లడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. క్షతగాత్రులను ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో కిషోర్ మృతి చెందారు. రాము చికిత్స పొందుతున్నాడు. మెకానిక్ పనులతో పాటు ఫ్లవర్ డెకరేషన్ చేస్తూ జీవిస్తున్న కిషోర్‌కు భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య గౌతమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచినాపల్లిలో ఆరంగిపేట యువకుడు..

గార: మండల కేంద్రం గార పంచాయతీ ఆరంగిపేటకు చెందిన మల్ల సంతోష్ (28) తమిళనాడులోని తిరుచినాపల్లిలో ఓ ప్రైవేటు పరిశ్రమలో లోడ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తోటి కార్మికులకు టీ తెచ్చేందుకు బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు కంపెనీ వర్గాలు కుటుంబ సభ్యులకు సమాచారమందించాయి. గతేడాది సంతోష్ తల్లిదండ్రులు మరణించగా, అన్నయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని సోమవారం ఆరంగిపేట తీసుకురాగా అంత్యక్రియలు పూర్తిచేశారు.

'న్యాయంగానే పరిహారం'



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి రోడ్డు కోసం భూములు ఇస్తున్న రైతులకు న్యాయపరంగానే పరిహారం అందజేస్తామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పోర్టు రోడ్డు ప్రభావిత తలగాం గ్రామం రైతులతో సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తరపున గ్రామ పెద్దలు హనుమంతు వెంకటేశ్వరరావు, కేకే రామయ్య, శివాజీ తదితరులు మాట్లాడారు. తమ ప్రాంతం అభివృద్ధి చెందే విధంగా నిర్మాణం చేస్తున్న పోర్టుకు తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే తమకు ఆమోదయోగ్యంగా పరిహారం వచ్చే విధంగా చూడాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పోర్టు వల్ల ఈ ప్రాంతం అన్నిరకాలుగా అభివృద్ధి చెందుతుందని, ముఖ్యంగా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, దీనికి రైతులంతా సహకరించాలని కోరారు. పరిహారం విషయంలో ఎవరికీ అన్యాయం జరగదని అన్నారు. తలగాం గ్రామం పరిధిలో 107 మంది రైతులకు సంబంధించి 38.31 ఎకరాలను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు.

• సేద తీరిన మంత్రి సీదిరి



పలాస మండలం చినంచల గ్రామంలో సోమవారం రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో గ్రామంలోని చింతచెట్టు కింద మంత్రి కాసేపు సేదతీరారు.

– కాశీబుగ్గ